ప్యూరిఫై మాటున గరళం!

గ్రేటర్‌తో సహా శివారు పురపాలక సంఘాల్లోని ప్రజలు ప్యూరిఫై వాటర్‌ను మాత్రమే తాగునీటిగా వినియోగిస్తుండటంతో ఇదే అదునుగా భావిస్తున్న కొందరు వ్యాపారులు ప్యూరిఫై వాటర్ పేరుతో నీటి వ్యాపారం చేస్తున్నారు.
– సాక్షి,మేడ్చల్ జిల్లా

నిబంధనలు పాటించకుండానే నీటి వ్యాపారం
- ఐఎస్ఐ మార్కు, లైసెన్సు లేకుండానే వాటర్ ప్లాంట్లు
- పట్టించుకోని అధికారులు, రోగాల బారిన ప్రజలు



నగరంలోని పలు కాలనీలు, బస్తీల్లో విచ్చలవిడిగా నీటి ప్లాంట్లు ఏర్పాటైనా.. ఒక్క చోట కూడా కనీస నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, పోచారం, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, తూంకుంట, ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో 1200కు పైగా ప్యూరిఫై (శుద్ధి) ప్లాంట్లు ఉండగా.. ఇందులో అన్ని అనుమతులతో కొనసాగుతున్న ప్లాంట్లు దాదాపు 200 వరకు ఉన్నట్లు జలవనరులశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నీటిని నిబంధనలకు అనుగుణంగా ప్యూరిఫై (శుద్ధి) చేయకుండానే విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరిగిన నీటివ్యాపారం..

గతంలో వేళ్ల మీద లెక్క పెట్టే సంఖ్యలో ఉండే ప్యూరిఫై ప్లాంట్లు.. నేడు పురపాలక సంఘాలలోని కాలనీలు, బస్తీలతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్లలోని ప్రధాన కూడళ్లలో ప్రతిచోట వెలిశాయి. పెళ్లిళ్ల ఇతర శుభ కార్యాలయాలు, పంక్షన్స్, హోటళ్లు, బార్లు, వైన్‌షాపులు, ఇతర వ్యాపార సముదాయాలను కలిపి వేలసంఖ్యలో క్యాన్ల విక్రయాలు జరుగుతున్నాయి. ప్లాంటు దగ్గరికే వెళ్లి తీసుకుంటే ఒక్కో క్యాన్‌కు రూ.10 తీసుకుంటున్నారు.

నియంత్రణ లేక..

మిషన్ భగీరథ పథకం రానప్పుడు తాగడానికి పనికిరాని నీరున్నట్లు సమాచారం వస్తే అక్కడ నీటిపరీక్ష జరిపి ఆర్వో ప్లాంట్లకు అనుమతిని ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితితో పాటు నియంత్రణ లేకపోవడంతో ఇదే అదునుగా భావిస్తున్న నీటి వ్యాపారులు ఇష్టమొచ్చిన రీతిలో ప్లాంట్లను విస్తరిస్తున్నారు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం, మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తేనే నగర, పట్టణ ప్రజలు అనారోగ్యం భారిన పడకుండా బయటపడే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

నిబంధనలు ఇవి..
- వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు బీఎస్ఐ అనుమతి ఉండాలి. ప్రతి ఏటా రెన్యువల్ చేసుకోవాలి. ప్లాంటులో విశాలమైన హాల్ ఉండాలి. వెలుతురు, గాలి ఉండేటట్లు చూసుకోవాలి.
- టైల్స్, గ్రానైట్ గచ్చు ఉండాలి. స్టీల్, హెచ్‌డీపీ పైపులైన్లు ఏర్పాటు అవసరం. ఐఎస్ఐ మార్కు కలిగిన ఫిల్టర్ యంత్రాలనే వాడాలి.
- నీటిట్యాంకులు, ఇతర సామగ్రి, నాణ్యమైనవి బిగించుకోవాలి. పురపాలక సంఘం లేదా మున్సిపల్ సర్కిళ్ల కార్యాలయం నుంచి ట్రేడ్ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

నేడు పాఠశాలలకు సెలవు

డీఈఓ విజయకుమారి

సాక్షి,మేడ్చల్ జిల్లా : భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశాల మేరకు గురువారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, ఎయిడెడ్, ప్రైవేటు స్కూల్స్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ప్రకటించారు.

వరద సమస్యను పరిష్కరించిన హైడ్రా



జేసీబీ సాయంతో పైపును తొలగిస్తున్న అధికారులు

జవహర్‌నగర్: కార్పొరేషన్ పాపయ్యనగర్‌లో ఎన్నో ఏళ్ల నాటి వరద నీటి సమస్యను హైడ్రా అధికారులు పరిష్కరించారు. బుధవారం చెన్నాపురం చెరువు నీరు అలుగుపారడంతో పాపయ్యనగర్‌లోని ఇళ్లలోకి నీరు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. హైడ్రా సహకారంతో అడ్డుగా ఉన్న పట్టాదారు వేసిన పైపులను తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. సమస్య పరిష్కరించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

పోచారం: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్ నుంచి నారపల్లి వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయానికి చిహ్నంగా తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఘట్‌కేసర్ పట్టణ అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ



ఘట్‌కేసర్: ఏదులాబాద్‌లో నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులను ఆ గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుధవారం అందజేశారు. కాగా గ్రామంలో మొత్తం 25 మంది పేదలకు రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజేందర్‌గౌడ్, రాజిరెడ్డి, నాయకులు సత్తయ్యముదిరాజ్, అమర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఇన్‌స్పెక్టర్‌తో కాంగ్రెస్ నేత రామిడి విజయరెడ్డి

కీసర: కీసర పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులును బుధవారం కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

సైబర్ నేరాలపై మరింత అవగాహన



మౌలాలి: సైబర్ నేరాలపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నేరేడ్‌మెట్ ఎస్‌హెచ్‌ఓ సందీప్ ఆదేశాల మేరకు మౌలాలి డివిజన్ సంతోషీమానగర్ చౌరస్తాలో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటీపీ, జాబ్‌ఫ్రాడ్, కొరియర్, వీడియోకాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరంలో డబ్బులు పోగొట్టుకుంటే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేసి ఆయా బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయాలని సూచించారు.

కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన



మాట్లాడుతున్న నల్ల మల్లారెడ్డి

పోచారం: విద్యార్థులు కళాశాలలో చేరిన తొలిరోజు నుంచే పట్టుదలతో లక్ష్యసాధన దిశగా కృషిచేస్తే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని, నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత నల్ల మల్లారెడ్డి అన్నారు. బుధవారం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టెక్నాలజీలో వస్తున్న మార్పులను నిరంతరం పరిశీలిస్తూ.. విద్యార్థులు తమను తాము మలచుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ సంధ్యావళి కేతిరెడ్డి, డైరెక్టర్ నల్ల దివ్య, కోశాధికారి డా.స్నేహ నల్ల, ప్రిన్సిపాల్ డా.ఎంఎస్‌వీ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డా.ఏ.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



రాంపల్లిలో సాంస్కృతిక ప్రదర్శనతో విద్యార్థులు



కీసర: జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అందరినీ అలరించారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, హెచ్‌ఎం.సుశీల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులున్నారు.

మాజీ సైనికులకు సత్కారం



నాగారంలో సత్కరిస్తున్న బీజేపీ నేతలు



గుండ్లపోచంపల్లిలో మాజీ సైనికులను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

కీసర: నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సైనిక ఉద్యోగులను బుధవారం సత్కరించారు. దేశానికి వారు చేసిన సేవకు కృతజ్ఞతగా వారిని సత్కరించామన్నారు. బీజేపీ నేతలు శ్రీనివాస్‌గౌడ్, నాగరాజుయాదవ్, మహిళా మోర్చా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మాజీ సైనికులు, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ అధికారులను బీజేపీ నేతలు ఘనంగా సన్మానించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రంరెడ్డి పాల్గొని దేశం కోసం పనిచేసిన మాజీ సైనికులు, అధికారులను సత్కరించారు. దేశ ప్రధానిగా మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ దేశానికి సేవ చేసే వ్యక్తులకు గౌరవం దక్కుతుందని తెలిపారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీధర్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున్‌ముదిరాజ్, సరస్వతి, నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్ మున్సిపాలిటీలో బీజేపీ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. అర్జున్, వంశీ, మహేష్, సర్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యలపై అధికారులతో సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వసంత

జవహర్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కమిషనర్ వసంత ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాల కారణంగా రోడ్లపై నీరు, డ్రైనేజీ నిల్వకుండా బయటకు వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఇంజినీరింగ్, శానిటేషన్, వైద్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు సమస్యలున్నా కంట్రోల్ రూమ్ 8074064746, 9963996908 నంబరును సంప్రదించి సమస్యను వివరించాలన్నారు. డీఈ మాధవాచారి, ఇరిగేషన్ ఏఈ స్వప్న, ట్రాన్స్‌కో ఏఈ సాంబశివరావు, డాక్టర్ తేజస్విని, మేనేజర్ నగేష్‌బాబు, ఆర్వో వెంకటేశం, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగించాలి

మేడ్చల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతి నగర్ –గౌడవెల్లి దారిలో చెరువు కట్టపై రోడ్డులో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని గౌడవెల్లి మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇరుకుగా ఉన్న రోడ్డులో చెట్లు ఏపుగా పెరిగి కొమ్మలు రోడ్డులోకి రావడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారిందని, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వెంటనే వాటిని తొలగించాలని, రోడ్డులో ఏర్పడిన గుంతలకు మరమ్మత్తులు చేయాలని కోరారు.

గురుకులాల సమస్యలపై సీఎం దృష్టి సారించాలి

మల్లాపూర్: గురుకులాల్లో నెలకొన్న నిత్యవసర సరుకుల రవాణా విషయంలో తలెత్తిన సమస్యల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని నల్లా రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. బుధవారం నాచారంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త టెండర్ పాలసీకి వ్యతిరేకంగా పాత సరకుల సప్లైదారులు సమ్మె కారణంగా గురుకుల విద్యార్థులు పస్తులుండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్ కనుకుంట్ల విజయ్‌కుమార్, గద్ద యుగేందర్, వెంకటేశ్వర్లు, సోను, అమరేందర్‌రావు, వెంకటేష్, అశోక్‌బాబు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి

మల్లాపూర్: తాగునీటి సరఫరాలో కలుషిత నీరు కలుస్తోందని దుర్గానగర్, బాబానగర్ మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఈ సమస్యను పరిష్కరించాలని జలమండలి ఏఈ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో పలుమార్లు డీజీఎం, ఏఈ, కార్పొరేటర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని వాపోయారు. సర్వేష్, నర్సింగ్, వెంకటేష్, సాయిలు, ప్రమీలా తదితరులున్నారు.

చెడు వ్యసనాలు ఆరోగ్యానికి హానికరం

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా





ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆరోగ్యానికి హానికరమైన మాదకద్రవ్యాలను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్‌బాడీ) రాధికాగుప్తా పిలుపునిచ్చారు. నషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జీఎల్‌బీ హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌స్ జిల్లా సంక్షేమ అధికారి శారద, కమ్యూనిటీ ఎడుకేటర్ విజయ, వివిధ శాఖల సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా యువత పాటుపడాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణపై జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. డ్రగ్స్ తీసుకునే, అక్రమ రవాణాచేసే వారి గురించి తెలిసిన సమాచారాన్ని 1908 టోల్ ఫ్రీ నంబరుకు తెలపాలని ఆమె సూచించారు.

మాదక ద్రవ్యాల నిరోధకంపై ప్రతిజ్ఞ

మేడ్చల్: మాదక ద్రవ్యాల నిరోధకంపై బుధవారం మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, అధికారులు స్నేహలత, ఎస్ఎన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం అధికారులు, సిబ్బంది మాదకద్రవ్యాల నిరోధంపై ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ నిర్వహించగా.. అనంతరం మున్సిపల్ కమిషనర్‌స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధిక వర్షాల నేపథ్యంలో సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి




ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్ రజిని

ఘట్‌కేసర్: నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ ప్రకటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రజిని అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మున్సిపల్‌శాఖ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. భారీ వర్షం కురిసి సమస్యలు తలెత్తితే అత్యవసర సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎరిమల్లెవాగును పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఇరిగేషన్ ఏఈ పరమేశ్, నాయబ్ తహసీల్దార్ రాజేందర్, ఆర్ఐలు కావేరి, సాయిరాం, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మాన్‌సూన్ బృందాల ఏర్పాటు



మేడ్చల్‌రూరల్: అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సూచనల నేపథ్యంలో మేడ్చల్ మున్సిపాలిటీలో 3 ప్రత్యేక మాన్‌సూన్ బృందాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక బృందాలు 8 గంటలకు ఒక బృందం చొప్పున 24 గంటలు విధులు నిర్వహించి పరిస్థితులను అంచనా వేసి తగిన చర్యలు చేపడతాయని వివరించారు. మున్సిపల్ కార్యాలయంలో 9392011506 నెంబరుతో అత్యవసర సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు ఉన్నతాధికారులు

‘పీటీసీ’లో ముగిసిన శిక్షణ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీ–సైబర్ సెక్యూరిటీ–ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్‌ను పోలీసులు వినియోగించడంపై రెండ్రోజుల పాటు నిర్వహించిన రిఫ్రెషర్ ట్రైనింగ్ కోర్సు బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో 100 మందికి పైగా పోలీస్ అధికారులు పాల్గొనగా.. వారికి సాంకేతిక పద్ధతుల ద్వారా నేర నియంత్రణ, భద్రతా వ్యవస్థ బలోపేతం, డిజిటల్ ఫోరెనిక్స్ పద్ధతులు, ఇంటలిజెంట్ సర్వైలెన్స్ సిస్టమ్ వినియోగంపై ఎథికల్ హ్యాకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ నిపుణులు అఖిలేష్, నిఖిల్, మల్లికార్జున్‌రావు శిక్షణనిచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్‌స్వామి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలీసు రోజువారి విధులలో ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ వినియోగం వల్ల సైబర్ నేరాలను అరికట్టడం, నేరస్తులను గుర్తించి అరెస్ట్ చేయడం వాటికి సహాయకారిగా ఉంటుందని, డ్రోన్ టెక్నాలజీ వినియోగం వల్ల ట్రాఫిక్‌జామ్‌లను గుర్తించడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికల గుర్తింపు, నిఘా వ్యవస్థ పటిష్టతకు దోహదపడుతుందని వివరించారు.

అక్రమార్కులపై చర్యలేవి..?

- ప్రభుత్వం, అసైన్డ్ భూముల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



కీసరగుట్ట సమీపంలో తవ్విన మట్టి

కీసర: మండల రెవెన్యూ పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమార్కులు పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. కీసర, అంకిరెడ్డిపల్లి, భోగారం, బర్సిగూడ, యాద్గార్‌పల్లి ఈస్ట్,వెస్ట్, తిమ్మాయిపల్లి, నర్సపల్లి గ్రామాల్లో మట్టి మాఫియా రెచ్చిపోతుంది. ఉదయం, రాత్రి తేడా లేకుండా ప్రభుత్వ, అసైన్డ్, భూముల్లో ఇష్టానుసారంగా పెద్దఎత్తున ఇటాచీలు, జేసీబీలతో మట్టి తవ్వకాలు జరిపి లారీల్లో వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలను అరికట్టాల్సిన వివిధ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- నాగారం,దమ్మాయిగూడ, ఈసీఐఎల్, రాంపల్లి తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున కొత్తగా ఇళ్లు, కంపెనీల నిర్మాణాలు కొనసాగుతుండటంతో ఇక్కడ మట్టికి చాలా డిమాండ్ ఉంది. కీసర మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మట్టి నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల బెస్‌మెంట్లు, కంపెనీల బెస్‌మెంట్లు నింపేందుకు ఒక్కో లారీకి రూ.5 వేల నుంచి 6 వేల వరకు మట్టిమాఫియా విక్రయిస్తున్నట్లు సమాచారం.

కేసులు నమోదు చేసి, సీజ్ చేసినా మారని తీరు..

ఇటీవల మట్టి తవ్వకాలకు సంబంధించి తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్ల దృష్టికి వచ్చిన సందర్భంలో పలుమార్లు మట్టి మాఫియాపై కేసులు నమోదు చేయడం, లారీలను సీజ్ చేయడం జరిమానాలు విధిస్తున్నప్పటికీ మట్టి తరలింపు మాత్రం ఆగడం లేదు. మట్టి వ్యాపారంలో మంచి లాభాలు ఉండటంతో మట్టిమాఫియా రెవెన్యూ, పోలీస్‌శాఖ విధించే జరిమానాలు చెల్లించి 2–3 రోజుల తర్వాత తిరిగి తవ్వకాలు జరపడం సాధరణమైపోయింది. మట్టి తవ్వకాలు కొనసాగిస్తే గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్డ్ స్థలాల్లో పెద్దఎత్తున మట్టి తరలిపోవడం, గుంతలమయంగా భూములు ఏర్పడతాయని, భవిష్యత్తుల్లో ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలు సైతం కనుమరుగవుతాయని, పలువురు వాపోతున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టి మట్టి తవ్వకాలను పూర్తిస్థాయిలో అరికట్టాలంటే మరిన్ని కఠినచర్యలు చేపట్టాల్సి ఉంది.

రాత్రి వేళల్లో తవ్వకాలు..

ఇటీవల మట్టి తవ్వకాలు జరుపుతున్న ముఠా రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తమ పని కానిచ్చేస్తున్నారు. రాత్రి 8 గంటలకు తవ్వకాలు ప్రారంభించి తిరిగి ఉదయం 8 గంటల వరకు తమ పని సాఫీగా ముగుస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉదయం మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలకు వచ్చిన అక్కడ ఎలాంటి ఇటాచీ, జేసీబీలు కనిపించకుండా జాగ్రత్తపడుతున్నారు. దీనిపై కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.